# Eenadu

# శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయండి

- **ఆసుపత్రుల్లో 'పొరుగుసేవల' విధానం రద్దుచేయండి**
- **ఏపీ సర్కారుకు హైకోర్టు ఆదేశం**

**ఈనాడు, హైదరాబాద్:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది నియామకాల్ని పొరుగుసేవల విధానం (ఔట్‌సోర్సింగ్) ద్వారా చేపట్టడాన్ని హైకోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. ఆ విధంగా చేపట్టే నియామకాలు భారతరాజ్యాంగం లోని అధికరణ 21కి, సర్వీసు నిబంధనలకు విరుద్ధమని తేల్చిచెప్పింది. పొరుగుసేవల విధానాన్ని తక్షణం రద్దుచేయాలని స్పష్టంచేసింది. ఆసుపత్రుల్లో ఖాళీలను గుర్తించి, (పోస్టుల ప్రాధాన్యత ఆధారంగా) కోర్టు ఉత్తర్వులు అందిన ఆరు నెలల్లో శాశ్వత ప్రాతిపదికన పోస్టుల భర్తీ చేయాలని ఏపీ సర్కారును ఆదేశించింది. శాశ్వత ప్రాతిపదికన పోస్టుల భర్తీ చేసేంత వరకు పిటిషనర్లను విధుల్లో కొనసాగనివ్వాలని స్పష్టంచేసింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏ.రామలింగేశ్వరరావు ఇటీవల ఈ మేరకు తీర్పును వెల్లడించారు. ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ పరిధిలో పొరుగుసేవల ద్వారా నియామకమైన తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తొలగిస్తున్నట్లు అధికారులు జారీచేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ గుంటూరు జిల్లాకు చెందిన పలువురు హైకోర్టును ఆశ్రయించారు. ఇదే తరహా అంశాలకు సంబంధించిన వ్యాజ్యాలన్నింటిపై సంయుక్తంగా విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి.. పొరుగుసేవల విధానం ద్వారా ఆసుపత్రుల్లో నర్సింగ్, పారామెడికల్ సిబ్బందిని తాత్కాలిక ప్రాతిపదికన నియమించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. భారత రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వాలు ప్రజలకు వైద్యసేవలు అందించడం 'తప్పనిసరి' అని న్యాయమూర్తి గుర్తుచేశారు. నిధులు సమృద్ధిగా లేవన్న కారణంతో ప్రభుత్వం నిర్వహించాల్సిన తన కర్తవ్యం నుంచి తప్పుకోలేదని స్పష్టంచేశారు.




## దివిస్ భూముల్లో యథాతథస్థితి

- **హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు**

**ఈనాడు, హైదరాబాద్:** తూర్పుగోదావరి జిల్లా తొండంగి మండలంలో ఫార్మస్యూటికల్ కంపెనీ నిమిత్తం దివీస్ లేబొరేటరీకి ప్రభుత్వం కేటాయించిన భూముల్లో యథాతథస్థితిని కొనసాగించాలంటూ ఉమ్మడి హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం కేటాయించిన భూముల్లో తమకు చెందిన 47.16 ఎకరాలకు పరిహారం చెల్లించలేదని, కేంద్ర భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇప్పించాలంటూ డెల్టా రిఫైనరీ లిమిటెడ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ సురేష్‌కుమార్ కైత్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున పి. సుభాష్ వాదనలు వినిపిస్తూ తొండంగి మండలం కోన గ్రామ పరిధిలోని వివిధ సర్వే నెంబర్ల కింద 47.16 ఎకరాలను కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఈ భూముల్లో ఫార్మ స్యూటికల్ కంపెనీ ఏర్పాటు చేయడానికిగాను 505 ఎకరాలను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించి, ఈ మేరకు గత ఏడాది సెప్టెంబరులో జీవో జారీ చేసిందని చెప్పారు. భూముల సేకరణ సందర్భంగా ఏపీఐఐసీ పరిహారం చెల్లింపు కోసం తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ వద్ద రూ.41.90లక్షలు డిపాజిట్ చేసిందన్నారు. తమకు ఇప్పటివరకు ఎలాంటి పరిహారం అందలేదని, పరిహారం ఇప్పించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. వాదనలను విన్న న్యాయమూర్తి ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ యథాతథ స్థితిని కొనసాగించాలంటూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు.